# ట్విస్ట్ !

గోడకు వేలాడుతున్న అద్దం ముందు నిలబడి వివిధ భంగిమల్లో నాముఖాన్నే వీక్షిస్తూ... గిరజాల జుత్తు దువ్వుకుంటు.. మధ్య మధ్య పోజులిస్తూన్న నా చూపు వున్నట్టుండి 'కిటికి' వైపు మళ్లింది.

పక్కనే ఆనుకుని వున్న అపార్ట్‌మెంట్ బెడ్‌రూమ్‌లో ఓ అందాల మెరుపుతీగను చూసి వులిక్కిపడ్డాను. ఆ పాప ఎవరైవుండనోపు? లోగడ ఎప్పుడూ చూచినట్టులేదే? చాలారోజులు ఆ అపార్ట్‌మెంట్ ఖాళీగ వుండటం నాకు తెలుసు!... అంటే ఇటీవలే కొత్తగ ఎవరైన అద్దెకు దిగివుంటారనుకున్నాను.

ఏమా పాప రూపలావణ్యం? ఆమెను కన్న పేరెంట్స్ ధన్యులు ! చేసుకోబోయే భర్త ధన్యుడు! మత్తెక్కించే కళ్ళు... అరనవ్వు రువ్వే పెదాలు... వాలుజడ... లిప్‌స్టిక్ రాసినట్టవుపించే ఎ(రని పెదాలు... టూత్‌పేస్ట్‌యాడ్‌లో అమ్మాయిని తలదన్నే తెల్లని పలువరస... బంగారు మేని ఛాయ.... భువి నుండి దివికేతెంచిన అప్సరసను **తల**దన్నే రూపలావణ్యం... అమ్మో వదిలిపెట్టకూడదు. లైన్లో పెట్టి మాట కలిపి లవ్ ట్రాక్‌లోకి దింపి నా సొంతం చేసుకోక తప్పదు అన్పించింది !

కొడితే సిక్సే కొట్టాలన్నట్టు... ప్రేమిస్తే... ఇలాంటి అమ్మాయినే దక్కించుకోవాలి! లైఫ్‌పాట్నర్ని చేసుకుంటే జన్మ ధన్యం !

అరె... చూస్తుండగానే చటుక్కున మాయమైందే... వాళ్ల మమ్మీనో... డాడీనో... పిలిస్తే వెళ్ళి వుంటుందని సరిపెట్టుకున్నాను.

పక్కింటి పాప మళ్లీ కన్పిస్తుందేమోనే ఆశ చావక బెడ్‌రూమ్ కిటికీ దగ్గరే తారట్లాడాను ! నా దృష్టి అంతా కిటికీ వైపే !

ఈసారి పాప కన్పిస్తే వీణమీటినట్టు కన్ను గీటాలి!-మాట కలపాలి! ఫ్లైయింగ్ కిస్ ఇవ్వాలి.... ఇంకా ఎన్నెన్నో చిలిపి ఆలోచనలు నా మస్తిష్కాన్ని తొల్చేస్తున్నయ్ !

తనేం చదువుకుందో... పేరేమిటో?... అన్ని వివరాలు అడగాలి!... నా ప్రయత్నానికి ఎవరు అడ్డొచ్చినీ సంహించేదిలేదు. నాలో నేను డిసైడై పోయాను.

'ఎంతసేపని ఆడపిల్లలాగ అద్దం ముందు నిలబడి షోకు చేసుకుంటావురా?... లంచ్‌బాక్స్ సర్దేశాను. బ్రేక్‌ఫాస్ట్ రెడీగ వుంది. త్వరగా రారా.. నీ ఆఫీసు వేళ మించి పోతోంది....' మమ్మీ రాగాలపనతో వూహలు చెల్లాచెదురైనయ్. అన్యమనస్కంగ వున్నవాడినల్లా... అయిష్టంగ అద్దంముందు నుంచి కదిలాను.

గబగబా నాలుగు ఇడ్లీ మింగి,.. లంచ్‌బాక్స్ అందుకుని స్కూటరెక్కాను. డ్రైవ్ చేస్తున్నా... నా మనసులో ఆ అమ్మాయి రూపే మెదులుతోంది! ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనల్లతో ఆఫీసు చేరుకుని లిఫ్ట్‌లో ఆరోఫ్లోర్ చేరుకుని రిజిస్టర్లో సైన్‌చేసి నా సీట్లోకెళ్లి కూర్చున్నా నన్నమాటేగాని వర్క్ చేయబుద్ధికాలేదు. మనసంతా కకావికలమైన ఫీలింగు.

అప్పటికీ డైవర్షన్ కోసం రెండు సార్లు చాయ్ తాగినా ఫలితం కన్పించలేదు. నా మనోఫలకం నుండి పాప రూపం అదృశ్యం కావటంలేదు. నన్ను తెగ కలవరపెట్టేస్తోంది.

డార్లింగ్... నన్ను వర్క్ చేసుకోనీ ! లేకుంటే బాస్ ఫైరవుతాడు. నా ఊపిరి తీయక... నన్ను వూరించక కాస్సేపు నువ్వు అదృశ్యమైపో... నీకు పుణ్యముంటుంది... అనేసి మసనులో ఆమెను వేడుకున్నాను. ప్రధేయపడ్డా ఫలితం శూన్యం.

ఇక లాభం లేదన్పించి లీవ్ పెట్టి తిరిగి ఇంటి దారిపట్టాను.

అమ్మో!... ఈ రోజుల్లో ఆడపిల్లలను అసలు నమ్మరాదు. వేసేవన్నీ టక్కరి వేషాలే! - స్నేహమంటారు... సినీమా అంటారు... క్లబ్బులంటారు... పబ్బులంటారు... ప్రేమంటారు.... మీదపడతారు.... చివరికి జేబులు ఖాళీ చేసి గుండు గొరిగేస్తారు.

ఛ!ఛ!ఛ! పక్కింటి పాప అలా కన్పించలేదు. మనిషి సింపుల్‌గ వుంది వెధవ్వేషాలేం వేయని అమ్మాయిలా అవుపించింది.

నైటీలోనో.... మేక్సీలోనో కాకుండా లంగాఓణీ వేసుకుని దర్శనమిచ్చింది. బహుశ ఈ కాలం పిల్ల అయివుండదన్పించింది. ఎంత సింప్లిసిటీ?.... ఎంత అణకువ?...

నేనో సూపర్‌మ్యాన్ అయిపోయి వాళ్లింట్లోకెళ్లి పాపవాడిలో వాలిపోవాలన్పిస్తోంది! అదేలా సాధ్యం? జీవితం ఇంగ్లీషు పిక్చర్ కాదుకదా!

బుగ్గలు కొరికేయాలని... ఎర్రని పెదాలు పిప్పరమెంట్ బిళ్లలా చప్పరించాలని... అమాంతం బిగికౌగిట బంధించాలన్పిస్తోంది.

ఒరే సన్నాసి వెధవా... నీకెందుకురా ఇలాంటి దురాలోచన? పరాయి ఆడపిల్ల గురించి తప్పుగా వూహించుకోవచ్చా? ఇలాంటి వెధవ్వేషాలేస్తే, బుక్కైపోతావురోరేయ్.

నేరుగ నరకానికే వెడతావ్. యమధర్మరాజు నిన్ను చిత్రవధ చేస్తాడు. కాలే నూనెలో పడేస్తాడు! ఫ్రై అయిపోతావ్.

'ఇప్పుడెలాగరా వెళ్లింది... అప్పుడే వచ్చేశావేం?... గుమ్మంలోనే నిలదీసింది మమ్మీ.

ఆమె ప్రశ్నకు ఏం జవాబివ్వాలో తెలియక బిక్కముఖం వేశాను.

'బాక్స్‌లో వున్నదాన్నే నువ్వు మింగు! మళ్లీ వంట చేసే ఓపిక లేదు నాకు... లోనికి ఏడు...' కటువుగ స్వాగతం పలకటంతో ఇంట్లోకి అడుగుపెట్టాను దీనంగ ముఖంపెట్టి...

'మీ డాడీ' ఏమైనా గుర్తుకొచ్చారా ఏంటి... మనిషివి అదోలా అవుపిస్తున్నావ్...' క్వశ్చన్ చేసింది మమ్మీ.

ప్రేమలో పడ్డవాడు ఎంతవాడైనా సరరే అలవోకగ అబద్ధం ఆడేస్తాడు. అదిరూలు! నేనూ మమ్మీతో తలనొప్పిగ వుంటేనూ... శలవుపెట్టి వ్చేశాను.... అని బొంకాను.

పిచ్చితల్లి నమ్మేసింది!...

డైనింగ్ టేబులు మీద కంచం పెట్టి లంచ్‌బాక్స్‌లో వున్న అయిటమ్స్ అందులో వడ్డించి 'భోజనానికి రారా కాళ్లు కడుక్కుని...' కేకేసింది.

బిట్వీన్ టైమ్‌లో బెడ్‌రూమ్‌లో కిటికీ దగ్గర నిలబడి పక్క అపార్ట్‌మెంట్ బెడ్‌రూమ్ వైపు లుక్కిచ్చాను... పాప వున్నదేమోనే ఆశతో! పాప ఎంతకీ కన్పించదే? భోజనం చేసి 'గుర్రు' పెడుతోందా?- ఇంట్లో పనితో బిజీగావుందా!- కాలేజీకి వెళ్లిందా? ఏదీ తెలియరాలేదు.

కోర్టులో బిళ్ల బంట్రోతు కేకేసి పిల్చినట్టు మమ్మీ మళ్లీ భోజనానికి రమ్మని అరిచింది. ఒక్క పరుగున వెళ్లి డైనింగ్ టేబులు ముందు కూర్చుని 'మమ్మీ'... డాడీ అమెరికా నుంచి ఎప్పుడొస్తారే...?-' అడిగాను కంచంలో వున్న వైట్‌రైస్‌లో దోసకాయ పప్పు కలుపుతూ...

'ఏమోరా?- ఫోను కూడా చెయ్యటం లేదీ మధ్య....'

'అసలొస్తాడో రాడోనే...'

'అదేంట్రా అట్లా అంటావ్...'

'నాకెందుకో డౌట్‌గా వుంది. అమెరికాలో సెకండ్ సెటప్ అరేంజ్ చేసుకుని వుంటాడేమోని...'

'ఛ ! తప్పు వెధవ ! నాన్న గురించి అట్లా మాట్లాడవచ్చా?-'

'అవునే... నీ సంరక్షణ భారం నే చూచుకుంటున్నాగా?.. ఆయన కు దిగులేముంది?- ఒక్కడూ ఇన్నేళ్లు నిన్ను విడిచిపెట్టి నీకు దూరంగా వంటరిగా వుంటున్నాడంటే నమ్మలేని విషయం !- నా పెళ్లికైనా వస్తాడనే నమ్మకం నాకులేదు...' ముద్ద నములుతూ తలెత్తి తల్లి ముఖంలోకి చూశాను.

'ఇప్పుడా అనవసరపు మాటలు దేనికి చెప్పు? - అప్పటి సంగతి తర్వాత ఆలోచించుకోవచ్చు...

ఇన్నాళ్ళుగా పెళ్లే వద్దని మొరాయించిన వాడినల్లా పక్కింటి పాప కళ్లబడేసరికి పెళ్లికి తొందర ఎక్కువైంది. మనసులో నిర్ణయాన్ని మమ్మీతో చెప్పేయాలన్పించింది !

విషయం మమ్మీతో చెప్పాల్సిందే ! పాప మెళ్లో మూడు ముళ్లు వేయాల్సిందే ! తప్పదు అంటూ నా మనసు ఘోషిస్తోంది.

మళ్లీ అంతలోనే... పాపతో ఎఫైర్ కొంత నడపిన తర్వాత చెప్తే బాగుంటుందన్పించటంతో ప్రస్తుతానికి నోటికి తాళం పడింది.

వరుసగ రెండు రోజులు పాప దర్శనం దొరక్కపోవటంతో మనసు విలవిల్లాడింది!. తిక్కపట్టినట్టన్పించింది ! ఏమైవుంటుంది నా 'గాడెస్'కి ? - ఏదైనా వూరు వెళ్లివుంటుందా? ఒకవేళ పెళ్లి అయిపోయిందేమో? - తానంత పరిశీలనగ పాప మెడలో తాళి నల్లపూసలు వున్నాయో లేవో చూడలేక పోయాను. ఏమిటీ కన్ఫ్యూజన్ ? ఏల ఈ తాపత్రయం?-

మూడవరోజు... పాపను వాళ్ల బెడ్‌రూమ్‌లో చూచి పరవశించిపోయాను. నన్ను చూడగానే ఓ అరనవ్వు అరకొరగా నవ్వేసి కన్ను గీటినందుకు నేను మేర్చపోవాల్సి వచ్చింది. ఈ పిల్ల చాలా హాట్‌గురూ అనుకోక తప్పలేదు.

కన్ను గీటిందంటే నాహృదయవీణా తంత్రులను మీటిందన్నమాటే !... నో డౌట్.. కన్ఫరమ్ అన్నమాటే !!- ఆహా... ఏమి నా అదృష్టం? అంటే పాప ట్రిక్కుల టక్కులాడి !! దీన్ని వదలకూడదు. నెత్తిన జీలకర బెల్లం పెట్టాల్సిందే !!....

నా కనుసైగలకు పాప వానపాములా మెలికలు తిరిగింది. సిగ్గుపడుతూ లోనికి

జారుకుంది!. ఇక ఆగలేను. పాపను పెళ్లాడేవిషయం మమ్మీతో చెప్పాల్సిందే నోడిలే!-

రాత్రి భోజనం సమయంలో వడ్డిస్తున్న మమ్మీ 'ఏమిట్రా నోలో నువ్వే నవ్వుకుని మురుస్తున్నావ్?-' నా మనోభావాలు పసికట్టి ప్రశ్నించింది.

'మమ్మీ నేను పెళ్లికి రెడీ...' పెండొరాస్ బాక్స్ ఓపెన్ చేశాను.

'ఇంకెందుకు ఆలశ్యం ? స్టార్ హంట్ ప్రారంభిద్దాం...'

'నెనెప్పుడో చూశాను. నువ్వే చూచి ఓ.కే. చెయ్యాలి...'

'ఎవర్రా ఆపిల్ల?-'

నెత్తిన కళ్లజోడు వుంచుకుని వూరంతా వెతికినట్టు. పక్కింట్లో అందాలరాసిని పెట్టుకుని ఇన్నాళ్లూ ఇద్దరం కళ్లు మూసుకున్నాం...'

'నిజంగానా? పక్కిల్లా... ఎటువైపు?'

'నార్త్‌సైడ్ అపార్ట్‌మెంట్‌లో ఓ గంధర్వ కన్య వుండటం ఈమధ్యనే చూశాను. నువ్వు గమనించినట్టులేదు కదా మమ్మీ !'

'అవున్రా... నేనెప్పుడూ చూడనేలేదు...'

'నువ్వు రేసే వాళ్లింటికెళ్లి ఆ అమ్మాయికి వివహం అయింద లేదా?- ఏం చదువుకుంది? డోరీ ఎంత ఇస్తారు? పిల్లకు బంగారం ఎంత పెడతరో.. పేరెంట్స్ ఏం చేస్తున్నారో... ఎట్సెట్రా వివరాలు సేకరించు! ఏ విషయం మనకు నచ్చకపోయినా అమ్మాయిని హృదయాధికంగా ప్రేమిస్తున్నాను కాబట్టి... ఇక ఆగేదిలేదు...'

'ఏమిట్రోయ్... ఆప్లి అంతటి భూలోక రంభా?-'

'వాళ్లింటికి వెళ్లి చూస్తే నీకే తెలుస్తుంది కదా నన్నడగటం దేనికి?...'

X X X

'హలో... నిన్నే....! నీపేరేంటి?- పక్క అపార్ట్‌మెంట్‌లో పాప కిటికీలోంచి కేఏకేయటం విన్న నేను అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్నవాడినల్లా నేను కిటికీ దాకా వచ్చి పాప పలుకరింపుకు విస్మయం చెందాను.

'ముంఉద నీ పేరు చెప్పు అమ్మడూ!... లేడీస్ ఫస్ట్ కదా?...' చిలిపిగ పాపకేసి తదేకంగ చూస్తూ ప్రశ్నించాను.

'రూప'

'పేరు అదిరిందీ... నాపేరు కిషోర్' బదులిచ్చాను. నాకంటే రూపే నయం ధైర్యంగ

మాట్లాడుతోంది. నేనొక పిరికి సన్నాసిని ! ఆలోచనేగాని ఆచరణపూజ్యం. గుండె ధైర్యం తక్కువ నాకు!.

గలగలా నవ్వేసింది రూప నవ్వి చప్పట్లు చరుస్తూ అక్కడే గెంతుతూ..

'రూపా... నా బంగారుపాపా... నీకు అమ్మా నాన్న... వున్నారా!-'

తల అడ్డంగ ఆడించి నొసలు చిట్లించటం గమనించి పాపం పేరెంట్స్ లేరు కాబోలు అనుకుని 'అవునూ మీ ఇంట్లో ఇక్కడ ఎవరున్నారు?-' సంభాషణ పొడగించాను.

'బామ్మ... నేను ఇద్దరమే... మాది ఈవూరు కాదు. అవునూ మనిద్దరం ఆడుకుందామా?... మా ఇంటికొస్తావా? కళ్లు చక్రాల్లా తిప్పుతూ ఆరిందలా ఆడగింది.

'లేదు జాబ్ చేస్తున్నాను నెలకు యాభైవేలు జీతం!- మా డాడీ అమెరికాలో వున్నాడు. నేను మమ్మీ ఇద్దరమే ఇంట్లో. నువ్వే ఒకసారి మా ఇంటికి రారాదూ.. ఎంచక్కా కబుర్లు చెప్పుకుందాం...'

'లమ్మో... బామ్మ నన్ను ఇల్లు కదలనీదు...అవును గానీ నువ్వు నన్ను అమెరికా తీసుకెడతావా... మీ డాడీతో కలిసి ఆటలు ఆడుకోవచ్చు...'

ఇదేంటి... రూప ధోరణి అదొక మాదిరిగా వుంది. పల్లే... అమాయకత్వం కాబోలనేసి సరిపెట్టుకున్నాను.

అయినా అదేం కోరి సెంటరా దాన్ని వెంటపెట్టుకు వెళ్లడానికి అన్పించింది.

'అది సరే గానీ రూపా.. నువ్వేం చదువుతున్నావ్?'

'నేనా... నేను...' బుర్రగోక్కుని దిక్కులు చూస్తూ 'మరే... టెన్తు.. చాలాసార్లు తప్పా..' కసిక్కున నవ్వింది.

ఇంత అందమైన నిన్ను అన్నిసార్లు తప్పించిన అడ్డగాడిద ఎవరు?. అందమైన ఆడపిల్లలను మంచి మార్కులు వేసి పాస్ చేయాలనే బుద్ధి లేదా వాళ్లకు... మనసులోనే వాపోయాను.

'అవును గానీ ఒరే... మనం లవ్ చేసుకుందామా' పెళ్లిచేసుకుందామా...? ఏదోటి తొందరగా చెప్పు...' గారంపోయింది రూప.

నన్ను ఒరే.. తురే... అంటున్నదేమిటి? పల్లెటూరులో పిట్టిపెరిగిన ఆడపిల్ల అయివుంటుంది. దీనికి తోడు టెన్త్ చాలాసార్లు తప్పినట్టు ఓపెన్‌గ డిక్లేర్ చేసిందికదా?

ఈ మాత్రానికే అలా సంబోధిస్తూ పిల్చినందుకు బాధపడకూడదు అని నాలో నేను సరిపెట్టుకున్నాను.

'మనిద్దరం కల్సి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఇందిరాపార్క్‌కు వెళ్దామా?-' అడిగాను.

'అక్కడికి దేనికి? ఐస్‌క్రీం కొనుక్కొని తినడానికా?-'

'కాదే పిచ్చి మొహమా ! లవ్వాడుకోటానికి అని ధైర్యంచేసి అన్లేకపోయాను.

'నేను రాను బాబూ!.. అదిగో బామ్మ కేకేస్తోంది వెళ్లాలి' అనేసి గబగబా వెళ్లిపోయింది.

మా ప్రేమ పాకానికి రాక.. అడుగడుగునా అవరోధాలు.. అడ్డంకులు ఎదుర్కోవలసి వస్తున్నందుకు నన్ను నేను తిట్టుకోక తప్పలేదు.

X X X

'భోజనానికి రమ్మని ఒకవైపు కేకలు పెడుతుంటే కదిలిరావేరా?... ఎవరిమీద నీ అలక?'

మమ్మీ చిటపటలాడింది.

'నీమీదే... నువ్వు నాకు నచ్చటం లేదు...' డైనింగ్ టేబుల్ వైపు నడుస్తూ బుంగమూతి పెట్టాను.

'నేనేం చేశాన్రా?-' భోజనం కంచంలో వడ్డిస్తూ నా ముఖంలోకి చూస్తూ అంది.

'పక్కింటి అందాల భరిణ గురించి వివరాలు తెల్సుకోమని చెప్పి పదిరోజులైనా... నీ నుండి రెస్పాన్స్ లేకపోయె...'

'అదా... నెనెప్పుడో ఎంక్వైరీ చేశాన్రా భడవా..'

వాళ్లేమన్నారో చెప్పు మమ్మీ ఊరించక..

'ఆ పిల్ల పేరు 'రూప' అట! తల్లి తండ్రీ ఆ అమ్మాయి చిన్నతనంలోనే చనిపోయారట... వాళ్లది ఇక్కడికి దగ్గర్లోనే ఓ పల్లెటూరట!- రూప టెన్త్ తప్పిందనీ..'

'ఇవన్నీ నాకు తెల్సిన న్యూసే ! ... తర్వాత చెప్పు... రూప రూపసి కదూ?.. నీకూ నచ్చిందా?-'

'ఆపరా నీ పిచ్చివాగుడు... ముందు భోజనం పూర్తి చెయ్!- నే తెలుసుకున్న నిజం చెప్పానంటే నీ గుండె చెరువౌతుంది.

'అదేంటి...?' అవాక్కయ్యాను.

'అదంతే! ఆ అమ్మాయి తిక్కపిల్లట్రా ! అమ్మాయికున్న పిచ్చి నయం చేయించుకోవటానికే సిటీకి ట్రీట్‌మెంట్ కోసం ఆరునెల్ల క్రితం వచ్చి పక్క అపార్ట్‌మెంట్లో దాగారని పిల్ల బామ్మ కళ్ల నీళ్లు పెట్టుకంటూ చెప్పింది.

అమ్మ చెప్పే మాటలు నాకు నమ్మవక్యంగ లేవన్పించింది.

'పిల్ల దురదృష్టం కాకపోతే... అంత అందమైన రపాన్నిచ్చిన ఆ దేవుడు వేపకాయంత పిచ్చి ఎందుకు పెట్టినట్లో?- పిల్ల బామ్మ చెప్తూంటే నాకెంతో బాధన్పించింది.

ఓరి దేవుడా!... నేరకపోయి పిచ్చిపిల్లనా నేను ప్రేమతో ఇష్టపడింది. ఆ పిల్ల మాటల ధోరణి పాటూ నాకు అప్పుడే డౌటన్పించినా... అమాయకత్వ ఏమోనేని మనసుకు సరిద చెప్పుకున్నాను... నేనెంతటి వెర్రివెధవను కాకపోతే ఆ మెంటల్ పిల్లను ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటాను.?-

ఏదిఏమైనా రూపకు ఆలోపం వుండి వుండాల్సిందికాదు. ఆ దేవుడు రూప పట్ల చిన్న చూపు చూసినందుకు నాగుండెలో ముల్లు గుచ్చుకున్నట్టయింది!!.

---సమాప్తం---